# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-3 5, ఆగష్టు, 2015

విద్యా శాఖపై మధ్యాహ్నం కూడా సమీక్ష కొనసాగింది. ప్రస్తుతం ఉన్న డిగ్రీ కోర్సులు ఉద్యోగ అవకాశాలను పెంచే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఎలాంటి ఉద్యోగావకాశాలు ఉన్నాయో గుర్తించి వాటికి అనుగుణమైన కోర్సులు డిగ్రీలో ప్రవేశపెట్టాలన్నారు. విద్యార్థులకు కూడా దీనిపై అవగాహన కలిగించాలన్నారు. పోటీ పరీక్షలంటే కేవలం పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ద్వారా వచ్చే ఉద్యోగాలే అనే భావన పట్టభద్రుల్లో నెలకొని ఉందని, కాని దేశ వ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఇంకా అనేక ఉద్యోగాలు ఉన్నాయనే విషయాన్ని డిగ్రీ స్థాయిలోనే విద్యార్థులు గుర్తించేలా చేయాలన్నారు. డిగ్రీ పూర్తయిన తరువాత చాలామంది యువకులు ఖాళీగానే ఉంటున్నారని, అలా ఉండకుండా డిగ్రీ చదువుతుండగానే తరువాత ఏం చేయాలనే విషయంపై వారికి స్పష్టత ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల నిర్వహణను మరింత సమర్ధవంతంగా నిర్వహించాలని, అవసరమైన లెక్చరర్ల నియామకాలను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలల్లో తెలుగు లేదా ఉర్దూ భాషలను సెకండ్ లాంగ్వేజ్‌గా ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉండాలని, ఇంగ్లీషు మీడియంలో చదివినప్పటికీ తమ మాతృ భాష అయిన తెలుగు లేదా ఉర్దూ భాషపై పట్టు కోల్పోకుండా ఉంటుందని అన్నారు.

అనాథ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెటాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని అనాథ పిల్లలందరికి తల్లీదండ్రి రాష్ట్ర ప్రభుత్వమే అని ఇప్పటికే ప్రకటించుకున్నందున అందుకు తగ్గట్లు వారి పోషణ, రక్షణ, చదువు, స్వయం సమృద్ది విషయంలో బాధ్యత తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అనాథలందరిని స్టేట్ చిల్డ్రన్‌గా గుర్తించాలని చెప్పారు. 10వ తరగతి పూర్తయిన స్టేట్ చిల్డ్రన్‌ను ఇంటర్మీడియట్‌లో రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు.

---

సిపిఆర్ఓ టు సిఎం